
# హింస రచన



285

డా॥ వి. చంద్రశేఖరరావు



గదిలో అతనొక్కడే. ఖాళీ చూపులతో. అతని చేతుల్లో ఒక మారణాయుధం. (పాతకాలపు రైఫిల్, ఒక్కొక్క తూటానే లోడ్ చేసుకునే టైపు). అతను అన్నివైపులకు పరిశీలనగా చూస్తున్నాడు. అతని ఖాళీ చూపుల, కళ్ళ చాటున ఒక నిర్లిప్తం, నిరసన, దుఃఖంలాంటి భావనలు.

తెల్లనిగోడల గది. మిలమిలలాడుతూ, అతని చుట్టూ వెలుగు లాగా కమ్ముకుంది. ఫ్లోరోసెంటు దీపాలు, అతనిపై పడి అతనో పౌరాణికమూర్తిలా కనిపిస్తున్నాడు. గదిలో గోడలు, ఫర్నీచర్ తప్ప, ఏ చిన్న పరికరమూ లేదు. కనీసం కుర్చీ కూడా. నిన్న సాయంత్రం ఆ సంఘటన తరువాత, గదిలోని పుస్తకాలన్నీ తన జూనియర్‌కి ఇచ్చాడు. లాప్‌టాప్, స్టీరియో సిస్టంని కోఠీ ఎలక్ట్రానిక్స్ బజార్లో అమ్మి వేశాడు. మంచం, బెడ్ అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌కు ఫ్రీగా ఇచ్చేశాడు.

గదిలో అతనట్లాగే చాలా యేళ్ళుగా, నిలబడ్డవాడిలా కాళ్ళు బరువెక్కి, ఒక స్థూపంలా ఉన్నాడు. ఎంతసేపు అలా నిలబడ్డాడో కూడా అతనికి తెలియదు. నిస్పృహ, అశాంతికి లోనయ్యే కాలం. ప్రతి చిన్న ఉద్వేగమూ, శిఖరస్థాయికి చేరే సమయాలు ఇవి. అతనిలో ఏదో రసాయనిక ప్రక్రియ జరుగుతోంది. అదేమిటో అతనికి స్పష్టంగా తెలియదు. అతని కళ్ళ నిండా ఆందోళన, కాళ్ళలో వణుకు.

ఇది సాఫ్ట్‌వేర్ కాలము. అతనో ఇంజనీరింగ్ విద్యార్థి. క్లాస్‌లో అతను టాపర్. 'ఓ' గ్రేడ్. ఇన్ఫోసిస్ ప్లేస్‌మెంటు వచ్చింది. ఆరునెలల క్రితం వరకూ అతని జీవితం, ప్రతి నిముషమూ ఉల్లాసగీతంలా ఉండేది. నాలుగు గంటలకే క్యాంపస్ నుంచి బయటపడతాడు. చెవుల్లో ఎంపీ-3, సంగీతం అతన్ని చుట్టుముట్టేది, ఎప్పుడూ ఏదో

పాట హమ్ చేస్తూ, పాటలు, పుస్తకాలు, (క్రైమ్ నవలలు), ఫ్రెండ్స్‌తో కబుర్లు, చాటింగ్, ఎస్ఎంఎస్‌లు, అతని ప్రపంచం. ఇప్పుడవన్నీ అదృశ్యమైపోయాయి. ఆరునెలల క్రితం అతను ప్రేమలో పడ్డాడు. అంతా అద్భుతంలా, హఠాత్తుగా జరిగింది. కట్ అండ్ పేస్ట్‌లా క్షణాల్లో జరిగిందా సంఘటన. అయితే ఆ ప్రేమ కథ కూడా ముగింపు దశకు చేరుకుంది.

కొద్దిగా అటూ ఇటూ కదిలాడు అతను. ముసురుతున్న ఆలో చనలు. బొంబాయిలో ఉద్యోగం చేస్తున్న అమ్మా నాన్న గుర్తు కొచ్చారు. అతని ముఖంలో విరక్తిలాంటి భావం. అరవై, డెబ్బయిల ఆదర్శాల కాలం నాటి మనుషులు వాళ్ళు. వాళ్ళ నాన్న ఎస్ఎఫ్ఐలో పని చేశాడు. వాళ్ళమ్మ కవిత్వం రాసేది. కుటుంబరావు, రంగ నాయకమ్మ రచనల ప్రభావం. ప్రేమించకుండా పెళ్ళి ఎట్లా చేసు కుంటాము అనేది. అట్లాంటి వారసత్వం ఉన్నందుకు అతను చాలా విసుక్కున్నాడు. కొత్త ఎకానమీ రోజుల్లో సృష్టించబడినందుకు, అతనికి కాస్త తృప్తిగా ఉంది. ఉద్యోగాలన్నీ ఎలక్ట్రానిక్ స్పందనలపై నడిచే కాలంలో ఉన్నందుకు కూడా అతనికి తృప్తిగా ఉంది.

గదంతా అసహనంగా తిరుగుతున్నాడు. జరిగిన విధ్వంసం తాలూకు ఆధారాల కోసం. (ఆ అమ్మాయి పంపిన ఈ-మెయిల్ తాలూకు కాపీలు, పబ్‌లో వాళ్ళిద్దరూ కలిసి డాన్స్ చేస్తున్నప్పటి ఫొటోలు, అన్నీ అతని జేబులో ఉన్నాయి.) అభౌతికమైన దేనికోసమో, అతను వెతుకు తున్నాడు. గోడలకు చెవులు పెట్టి విన్నాడు. ప్రేమ విఫలమైనపుడు, (సరిగ్గా చెప్పాలంటే ప్రియురాలు మోసం చేసి నప్పుడు) రకరకాల సినిమా ల్లోని, కథానాయకులు ఏం చేస్తారు అని ఆలోచించాడు. కీ బోర్డు శబ్దాలు, మానిటర్‌పై అక్షరాల మిలమిలలు, (వంద పేజీల ఈ మెయిల్స్ ఇచ్చి ఉంటాడు) "వాట్ టు డూ?" అంటూ ట్విట్టర్‌లో మెసేజ్ పోస్ట్ చేశాడు.





సాయంకాలం చివరి కిరణం, అతని కళ్ళలో పడింది. మహా వేగంతో ప్రవహించే నదిలా వెలుగు అతని ముఖంపై ప్రసరించింది. జేగురురంగు వెలుగు. కొద్దిసేపటిలోనే ఆ వెలుగు చీకటిబొట్టులా మారిపోయింది. అతని కళ్ళముందు, ఆ అమ్మాయి రూపం ప్రత్యక్ష మైంది. ఆమెతో గడిపిన సమయాల్లోంచి, మిగిలిపోయిన కొద్ది క్షణాలు, ఒక ఛాయలా; ఆ ఛాయను ముట్టుకున్నాడు. మృదువుగా, తడిగా ఉందా స్పర్శ. ఆ రూపం చుట్టూ అలుముకున్న పరిమళమేదో ఆస్వాదించాడు. మెల్లగా గదిలో అతనికి చిరపరిచయమైన వాసనలు, ప్రదేశాలు (వాళ్ళి ద్దరూ కలిసి తిరిగినవి). కోపం లాంటిదేదో భావన. పళ్ళు కొరికాడు. "బిచ్, బ్లడీ బిచ్" అంటూ పెద్దగా తిట్టాడు. శరీరంలో జ్వర తీవ్రత. ఉద్వేగాలు అతని అదుపును దాటాయి.

చిల్డ్ బీరు, తాగితే బాగుండు అని, అతని నాలుక కోరుకుంది. ఎఫ్.టి.వి ఛానల్‌లోంచి ప్రవహించే నిండైన, బిగువైన స్తనాలు గది నిండా, ఏ అచ్ఛాదనా లేకుండా, మొలుచుకు రావటం, అతను గమ నించాడు. కాంక్షతో అతని శరీరం బిగుసుకుపోయింది. (ఈ గదిలోనే, వాళ్ళిద్దరూ గడిపిన, తొలి లైంగిక అనుభవం గుర్తుకొచ్చింది) తీవ్రమైన లైంగిక వాంఛగా అతను మారిపోవటం అతనికి అర్థమవుతోంది. గది, ఒక స్త్రీ నగ్న శరీరం కావటం అతనికి తెలుస్తోంది. హోరెత్తే, మహా సాగరంలా ఆమె శరీరం ఎగిసిపడుతోంది. గది నిండా అతని 'స్పెరమ్' వాసన. అతని కళ్ళలో వణుకు. ఇంత మహాకాయాన్ని ఎట్లా చంపటం. (చంపటం అనే మాట లేదా ఊహ దగ్గర అతను దాదాపు గంటసేపు తచ్చాడి) అతను నిజంగానే ప్రేమించి నిజంగానే మోహించి, మహా సముద్రమంతటి మూర్తిని (ఆ అమ్మాయి పేరు కారుణ్య), ఎట్లా చంపటం. ఇంత చిన్న బుల్లెట్, అంత పెద్ద శరీరాన్ని చిధ్రం చెయ్య గలదా? పోనీ కత్తులతో, ఎన్ని కత్తులు కావాలి? అతని చేతులు

వణికాయి. గదికున్న ఒకేఒక గాజుకిటికీకి కళ్ళను అతికించి బయటకు చూశాడు. మనుషులు నడుస్తున్నారు (నడక కాదు పరుగు). కార్లు, ఆటోలు. ఒకటే రొద. పక్క అపార్టుమెంటులోంచి, టీ.వీ వార్తలు పెద్ద పెద్దగా, ఆర్థిక లావాదేవీలు, షేర్లు, కొత్త రాజకీయ పార్టీ, రాష్ట్ర విభజన, ప్రియురాలిపై యాసిడ్ పోసిన సంఘటనను ఖండిస్తున్న వార్త. సరిగ్గా ఆ వార్త దగ్గర శబ్దాలు ఆగి పోయాయి. పదే పదే రివైండ్ అవుతున్న టేప్‌లా ఆ వార్త గదినిండా, ప్రతిధ్వనిస్తోంది. చిక్కటి ద్రవ మేదో అతనిపై చింది పడినట్లుగా. శరీరం బుస బుసమని పొంగి, కమురు వాసన, శరీరంపై నిప్పులు పోసినట్లు, భరింపరాని నొప్పి ఏదో, ఆశ్చర్యంగా, అతనా బాధను ఎంజాయ్ చేస్తున్నాడు. ఆ క్షణంలో హింస అతనికి ఇష్టమైన అనుభూతి అయ్యింది.

* * *

'ప్లేస్‌మెంట్స్' అయిపోయినాక అతను బాగా రిలాక్స్ అయ్యాడు. రాత్రి పది అవుతూనే రెండు మగ్గుల బీరు తాగి నిద్ర పోయేవాడు. నిద్ర సముద్రపు అలలా తోసుకువచ్చేది. లోతైన లోయ లోకి జారిపోయినట్లు. తలుపు చప్పుడు (ఫ్రెండ్స్), సెల్‌ఫోన్ రింగింగ్, (తల్లిదండ్రులు) రోడ్లపై వెళ్ళే కార్ల రొద, ఎంటీవీ పాటలు ఏవీ అతని నిద్రలోకి జొరబడేవికావు. అంత నిద్రలోనూ 'ఆమె' పలకరింపు అతనికి తెలుస్తుంది. ఆమె సెల్‌ఫోన్ రింగింగ్ ప్రత్యేకంగా ఉంటుంది. నిద్రలోకాల్ని దాటుకుని, అతన్ని ముద్దు పెట్టుకుంటుంది. ఉలిక్కిపడి నిద్ర లేస్తాడు అతను.

"నిద్రపోతున్నావా?" అంటుంది. "ఊ" అంటూ, నిద్రలోంచే జవాబు చెబుతాడు. ఆమె కాసేపే మాట్లాడుతుంది. 'ఏ మాటర్ ఆఫ్ ఫ్యాక్ట్'లాగా ఉంటాయి ఆమె మాటలు. సాయంత్రం కాఫీ డేలో కలుద్దాం లేదా 'లైఫ్ స్టైల్‌కి వెళదాము', లేదా 'లాండ్‌మార్క్‌లో పుస్తకం





ఒకటి కొనిపెట్టు, ఫ్రెండ్‌కి గిఫ్ట్ ఇవ్వాలి', అట్నుంచి 'చట్నీస్'కి వెళ్ళి డిన్నర్ చేద్దాం' లాంటి మాటలు. మృదువైన ఆమె గొంతు తెరల్ని చీల్చుకుని, అతన్ని తాకుతుంది. ఎక్కడో స్వప్నలోకంలోంచి వస్తు న్నట్లుగా ఉంటాయి ఆమె మాటలు. ఒక్కోసారి రాత్రి పన్నెండుకు ఫోన్ చేస్తుంది. ఒకసారి ఆమె ఫోన్ చేసే సమయానికి బయట కుండ పోతలా వాన. కారుమబ్బులు అన్నివైపుల నుంచి చుట్టుముట్టి, అతను నిద్రపోతూనే ఉన్నాడు. ఉలిక్కిపడి లేచాడు. "నిద్రపోతున్నావు కదూ," అంది ఎపొలజిటిక్‌గా. "టీ తాగుదాం, బయటకు రా," అంది బ్రతిమ లాడుతున్నట్లుగా. అంత వానలోనూ, లేచి, స్నానం చేసి, డ్రస్ అయ్యి, పల్సర్ స్టార్ట్‌చేసి, 'ఇదేమిటి? ఇదేమి ప్రేమ? ఆమెకు పూర్తిగా సరెండర్ అయి, ఆమె పిలుపుకు సమస్తాన్ని వదిలేసి, ఇలా వర్షంలో తడుస్తూ, ప్రేమ జబ్బుకు నేను ఎడిక్ట్ అయ్యానా,' అని అనుకున్నాడు అతను.

ఆ అమ్మాయి మృదువైన కల లాంటిది. క్లాసులు ఎగ్గొట్టి, క్యాంపస్ ఒకమూలన కూర్చుని అతని కోసం ఎదురుచూసేది. అతను కె.టి.ఎస్. టైపు మంచి స్టూడెంటు. వాళ్ళు రాత్రంతా మేలుకుని ఉండేవాళ్ళు. ఏవేవో కబుర్లు, సమస్తమూ వాళ్ళదే అయినట్లు. పుస్తకాలు, ఫ్రెండ్స్, సీ.డీలు, రెహమాన్ పాటలు సీక్రెట్ ఎఫైర్స్, అన్నిం టిని గురించి మాట్లాడుకునేవాళ్ళు. అప్పుడప్పుడూ రహస్యంగా బీరు తాగేవాళ్ళు. కాలం తెలిసేది కాదు. ఆ అమ్మాయి అద్భుతమైన వ్యక్తి.

ఆమె పెదవులపై ఎప్పుడూ ఒక నవ్వు మిలమిలలాడుతుంది. నవ్వుతున్నప్పుడు ఆమె బుగ్గలు సొట్టలు పడి ఎంతో అందంగా ఉండేది. ఆమె నవ్వుపై అతను చాలా కవితలు (ఇంగ్లీషులో) రాశాడు. అతనికి ఉద్యోగం నిర్ణయం అయినాక, ఇద్దరూ దాదాపు కలిసి ఉంటున్నారు. చాలా రాత్రులు అతని గదిలో గడిపేది. కలలోని మనుషుల్లా, లోపలంతా సంతోష గీతాల్ని నింపుకున్నారు వాళ్ళు.

నెలరోజుల క్రితం, ఆమె అతనికో విషయం చెప్పింది. అతను భయంతో వణికిపోయాడు. ఆమె ముఖంలో ఏ ఉద్వేగమూ లేదు. గతంలో ఆమెకో అబ్బాయితో ఎఫైర్ ఉండేదని చెప్పింది. "అది బ్రీఫ్ ఎపిసోడ్, ఎ పాసింగ్ క్లౌడ్" అని కూడా చెప్పింది. ఆ అబ్బాయి (శ్రీను)కి యాక్సిడెంట్ అయి హాస్పిటల్‌లో ఉన్నాడని చెప్పింది. హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది. శ్రీను తలనిండా కట్లు కట్టి ఉన్నారు. కోమాలాంటి స్థితి. ఎవరినీ గుర్తుపట్టలేదు. "శ్రీను అంటే నాకిప్పటికీ ప్రాణం," అంది ఒకసారి అతనితో. అతనికంతా గజిబిజిగా ఉంది. గందరగోళంలా ఉంది. సినిమా కథలా ఉంది. నిన్న ఉదయం ఆ అమ్మాయి ఒక ఎస్.ఎం.ఎస్ ఇచ్చింది. "ఇంక నన్ను మరిచిపో. శ్రీనుకి నా అవసరం ఉంది. అతను దగ్గరగా ఉన్నప్పుడు 'కంఫర్ట్'గా వుంటుంది నాకు. అతను నా 'సర్వైవల్ నీడ్' అయ్యాడు," అంటూ. అతను తట్టుకోలేకపొయ్యాడు. చాలాసేపు ఏడ్చాడు. దాదాపు ఐదు వందల ఎస్.ఎం.ఎస్‌లు ఇచ్చాడు ఆమెకు. 'నువ్వు లేకపోతే నేను బ్రతకలేనంటూ.' హాస్పిటల్‌కి, ఆమె గదికి పిచ్చివాడిలా తిరిగాడు. ఆమె అతనివైపు చూడడానికి ఇష్టపడలేదు. ఒకరోజు అతనిచ్చిన గిఫ్ట్ లన్నీ, ఉత్తరాలు ఈ-మెయిల్ కాపీలు, కవర్‌లో పెట్టి అతనికి పంపింది. వారం క్రితం వాళ్ళ ప్రేమ గురించి క్యాంపస్‌లో స్కాండల్స్ మొదలైనాయి. అందరూ అతనివైపు జాలిగా చూస్తున్నారు. రాత్రులు నిశ్శబ్దంగా భయపెడుతున్నాయి అతన్ని. నిన్న ఉదయం శ్రీనుతో తన పెళ్ళి నిర్ణయం అయిపోయిందని, ఆమె ఎస్.ఎం.ఎస్ ఇచ్చింది.

* * *

గదిలోంచి బయటకు వచ్చాడు. రోడ్డుపై వందలుగా మనుషులు, తొక్కుకుంటూ, తోసుకుంటూ, ఆ గుంపులో కలసిపోయి, అతని రూపం, ఉనికి అదృశ్యం అవటం, అతనికి బాగుంది. ఆక





లేసింది అతనికి, ఇరవై నాలుగు గంటలైంది అతను ఏదైనా తిని. ఇన్ని గంటలూ ఒంటరిగా గదిలో గడిపాడు. ఈ ఇరవై నాలుగు గంటల్లో, 'ఆమెపై అతని కోపం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ద్వేషం, కసి. ఆమె అనే ఊహను తట్టుకోలేకపోతున్నాడు. ఇరవై నాలుగు గంటల తరువాత ఆమెను చంపి వేయాలనే కోరిక అతనిలో మొలకెత్తింది. ఆ ఆలోచన అతనికి బాగుంది. ఓదార్పునిస్తోంది. ఆత్మీయుడైన ఒక మిత్రుడితో మాట్లాడాడు. స్నేహితుడు కూడా 'చంపటం' అనే ఆలోచనను సమర్థించాడు. ఎట్లా చంపాలో కూడా ఆ మిత్రుడే సలహా ఇచ్చాడు. ఒక్కసారి రూమ్‌కు రమ్మని బ్రతిమి లాడాడు. 'ఫేర్‌వెల్ టాక్'. మరిక నిన్ను విసిగించను అని చెప్పు. అప్పుడే, ఆ టైములో..."

ప్రణాళిక సిద్ధం అయ్యింది. అతని మూడ్, ఒకానొక స్థితి దగ్గర ఆగిపోయింది. ఆ స్థితికి, అటూ, ఇటూ ఉన్నా స్పందనలన్నిం టినీ పక్కకు తోసివేశాడు. మృదువైన జాలి, కరుణలాంటి అను భూతుల్ని నిర్భయంగా మనసు లోతుల్లోకి తొక్కేశాడు. అతనిప్పుడు, ఉన్మాదపు ఎరుపురంగు ఆత్మ+తీవ్రమైన, ఒత్తిడికి లోనైన, విచక్షణ లేని ఒక దేహం. అందమైన, జాలి గొలిపే మాటలతో ఆ అమ్మాయికి ఎస్.ఎం.ఎస్. ఇచ్చాడు. 'చివరిసారిగా, ఒక్కసారి మనం కలుద్దాం. నీకు గుడ్ బై చెప్పనివ్వు,' అంటూ.

అతనికి ఆకలి వేసింది. రోడ్డు పైన కనపడే ప్రతి 'జంక్ ఫుడ్' పిజ్జా, కేక్, పేస్ట్రీలను, శరీరంలోకి తోసివేశాడు. ఆకలి, నిద్ర లాంటివి ఆ శరీరానికి అవసరం లేదు. కానీ తినడం, అనే ప్రక్రియ అతనికి 'గ్రాటిఫికేషన్' ఇస్తుంది.

ఈ రాత్రి నాకొక కాళరాత్రి అనుకున్నాడు. రోడ్డుపై వేగంగా నడవడం మొదలుపెట్టాడు. మరోసారి ఏదైనా తినాలనే కోరిక. ఈసారి చికెన్ కార్న్‌సూప్, చికెన్ ఫ్రైడ్‌రైస్ తినాలనిపించింది. కె.ఎఫ్.సి వైపు

వెళ్ళాడు. చికెన్ లెగ్ పీస్ తింటుండగా, అతనికి కారు ఎక్కాలనే కోరిక కలిగింది. వాళ్ళ నాన్న స్నేహితుడికి ఫోన్ చేశాడు. పది నిముషాల్లో కారు వచ్చింది. హోండా సిటి కారు. ఇప్పుడే కన్న అద్భుత స్వప్నంలా ఉందా కారు. ప్రేమగా దాన్ని నిమిరాడు. మెత్తటి ఫోమ్ సీట్లు. ఆడపిల్ల వక్షంలా ఉన్నాయి. కారు లోపల కూర్చున్నాక, కారు లోపలి ఫెర్ ఫ్యూమ్స్, మత్తు గొలిపాయి. వింత ఉద్వేగం అతన్ని చుట్టిముట్టింది. రోడ్డుపై మనోహరంగా పరిగెడుతోంది కారు. ఈ ప్రయాణం బాగుంది, అని రెండు మూడుసార్లు గొణుక్కున్నాడు. ఎఫ్.ఎం. రేడియో ఆన్ చేశాడు. అతి జుగుప్సాకరమైన పాట వినిపిస్తోంది. పాట అయిపోయి నాక, హస్కీ గొంతుతో ఒక అమ్మాయి. షేర్ మార్కెట్ల గురించి చెబుతోంది. షేర్ మార్కెట్లు, నిఫ్టీ, బియస్సీ, చెవులకు ఇంపుగా ఉన్నాయి ఆ మాటలు. ఇన్ఫోసిస్ లాభాల గురించి చెప్పింది. వాళ్ళ షేర్ పెరిగిందని చెప్పింది. థ్రిల్ ఫీలయ్యాడు. చైనాలో షేర్ మార్కెట్ గురించి వివరించింది. ''బ్లడీ కమ్యూనిస్ట్లు'' అని ప్రేమగా తిట్టు కున్నాడు. భగవంతుని ఉనికిలాగా, ఈ కమ్యూనిజం ఉనికి కూడా నిజం అనుకున్నాడు. (వాళ్ళ నాన్న ఇప్పటికీ, కమ్యూనిజమే ఈ దేశాన్ని రక్షిస్తుందని నమ్ముతాడు.)

హఠాత్తుగా అతనికి వాళ్ళ నాన్న గుర్తుకొచ్చాడు. వాళ్ళమ్మ కూడా. నో, నో ఇదంతా సెంటిమెంటు, నాన్సెన్స్. ట్రాష్ ఇదొక ఇల్యూషన్. ఈ కారు ప్రయాణం, షేర్ల విన్యాసం ఇవి మాత్రమే నిజం, అనుకున్నాడు.

కారు వేగాన్ని పెంచాడు. నూట ఇరవై దాటింది. ప్రపంచం సన్నటి గీతలా కనబడసాగింది. మనుషులందరి మాటలు 'ఫ్రీజ్' అయి, బుజ్జ్...' అని మాత్రం వినిపిస్తోంది. ఆ వేగంలో, అతని సమస్త ఆలోచనలు ఆగిపోయాయి. అన్ని అనుభవాలు నమ్మకాలు, కథలు,





సంఘటనలు, వేగంగా పరుగెత్తే గాలిని 'ఢీ' కొని, శూన్యంలోకి అదృశ్యం అవుతున్నాయి. వేగంగా పరిగెడుతున్న కారుకు, సడెన్ బ్రేక్ వెయ్యాల్సి వచ్చింది. క్రీచ్ మంటూ శబ్దం. ఎదురుగా రైల్వే గేటు, గేటు మధ్యన పట్టాలపై రోడ్డునంతా ఆక్రమిస్తూ, ఒక ఆడమనిషి శవం. శవంది మహాకాయం. రోడ్డు రెండు అంచుల్ని తాకేంత ఉంది. చుట్టూ ఈగలు మూగి ఉన్నాయి. పొట్ట పగిలి, లోపలి పేగులు, బయటకు వచ్చి, పట్టాలపై పోగులుపడి ఉన్నాయి. తల చిట్లి వుంది. నాలుక బయటకు వచ్చి, మహాకాళి నాలుకలా భయపెడుతోంది. కళ్ళు చిట్లిపోయి, ఖాళీ గుంటలు, రెండు ఘోరమైన శాపాల్లా వున్నాయి. భయంతో వణికిపోయాడతను. చావు ఇంత భయానకంగా ఉంటుందా? అతని శరీరం చెమట్లతో నిండిపోయింది. వెనక్కు వెళ్దామని చూస్తే రోడ్డంతా వాహనాలే. గేటు చుట్టూ జనం మూగారు. ఒక చిన్న కుర్రవాడు, గుంపును చీల్చుకుని, ఆతృతగా, ముఖం ముందుకు పెట్టి శవాన్ని చూడాలని, బాలెన్స్ తప్పి, ముందుకు శవం పై పడబోయి, ఒక ముసలమ్మ, వెనక నుంచి, వాడి చొక్కా పట్టుకుని, లాగి, పడకుండా ఆపింది. మాట్రిక్స్ సినిమాల్లో 'ఓరాకిల్' పాత్రలా ఉందా మనిషి. జుట్టు విరబోసుకుని, ముఖంపై మార్మిక మైన నవ్వును అతికించుకుని. అక్కడ మాటల చప్పుడు. చుట్టూ మూగిన జనం చనిపోయిన మనిషి గురించి మాట్లాడుకుంటున్నారు. ఒక సామూహిక దుఃఖం, దిగులు, ఆ చనిపోయిన మనిషిపై సానుభూతి. ఎవరో ఆ చనిపోయిన మనిషిది, ఆత్మహత్య అన్నాడు. "ఎంత దుఃఖాన్ని అనుభవించిందో, ఈ ఆడకూతురు," ఎవరో జాలి పడ్డారు. హఠాత్తుగా, ఆ ఒరాకిల్ ముసలమ్మ గొంతు, "ఏదో విషయాన్ని పట్టుకుని, అదే నిజమని నమ్మినంతకాలం, మనం బాధ పడుతూనే ఉంటాము," అంది పల్చటి చిరునవ్వుతో, సత్యాన్ని ప్రకటిస్తున్న

దానిలా. జనం ఆమెవైపు వింతగా చూశారు. ''అసలీ చావడాలెందుకు,'' అన్నాడెవడో, వెనకాల నుంచి, బుద్ధుడు ముఖం పెట్టుకుని, ''ఏదీ శాశ్వతం కాదని తెలియజెయ్యడానికి,'' అంది ఒరాకిల్ ముసలమ్మ. చిన్న కుర్రవాడు, ఆ శవం ముందు కూర్చుని, శవం వైపు ఆసక్తిగా చూస్తున్నాడు. ఆ కుర్రవాడు మినహా, ఎవరూ శవం దగ్గరకు వచ్చే ధైర్యం చెయ్యలేదు.

శవాన్ని చూసినప్పటి భయం, అతన్ని ఇంకా వదలలేదు. మెదడులో భయం తాలూకు స్పందనలు మొదలయినాయి. మెదడును ఖాళీగా ఉంచడానికి, సమస్తాన్ని తుడిచి వెయ్యడానికి ప్రయత్నించాడు. ఊహు... అతనికి సాధ్యం కాలేదు. క్షణంసేపు, అతనికి తెలియని మరో ప్రపంచం, అతనికి అవగతం కాని మరో సత్యం ఉందేమోనని అనిపించింది. పైన నల్లనల్లని ఆకాశం. వేసవి తాలూకు ఉక్కపోత తాలూకు వాననేదో, వెగటుగా. శవం చుట్టూ మూగిన వాళ్ళలో కొద్దిమంది వెళ్ళిపోయారు. అతను కారు దిగి, కాసేపు అసహనంగా అటూ ఇటూ తిరిగాడు. గేటుకు, ఆ వైపున, ఈ వైపున వందలాది వాహనాలు. వెనక్కు తిరిగి వెళ్ళటం, దాదాపు అసాధ్యం. కారుకు ఆనుకొని, తన లోపల ఉద్వేగాలను కంట్రోలు చెయ్యాలని చూశాడు. దూరంగా ఎక్కడో పొలాల మధ్యన మేకలను తోలుకుంటున్న కుర్రాడు. ఒంటి మీద కాషాయ శాలువా కప్పుకొన్న భిక్షువు వొకడు బిగ్గరగా పాడుతున్నాడు. గాలి అలలపై నుంచి ఎవరివో మాటల గుసగుసలు, గుసగుసల మధ్యన స్త్రీ రోదన ఒకటి, దుఃఖం దుఃఖంగా, కత్తిపదునులా మనసును కోస్తున్నట్లుగా, అతని గుండె వేగంగా కొట్టుకుంటుంది; అతని లోపల ఏదో గాయం లోతుగా, చీముపట్టి, భీకరంగా సలుపుతున్నట్లుగా. ఆ అమ్మాయి (కారుణ్య) గుర్తుకొచ్చింది. మెత్తటి పట్టుదారంలా మృదువైన గొంతు





ఆమెది. గాలికి ఊగుతూ బంగారురంగులో మెరిసిపోయే ఆమె జుట్టు. అతని గుండెలపై పడుకొని, మృదువైన వేళ్ళతో అతని గుండెపై ఆమె పేరును దిద్దుకుంటూ. ఇట్లాంటి ఆలోచనలు రావం అతనికి ఇష్టంగా లేదు. విసుగ్గా, కోపంగా, 'హూ...'' అంటూ పెద్దగా అరిచేడు. విసురుగా వీస్తున్న గాలి అతనిపై కొరడాలు ఝళిపిస్తుంది. సెల్‌ఫోన్ కోసం వెతుక్కున్నాడు. 'మై హార్ట్ ఈజ్ బీటింగ్,' అంటూ రింగ్‌టోన్. ఉలిక్కిపడ్డాడు. ఆ అమ్మాయి నుంచి ఫోన్. అతన్ని కలుసుకోడానికి వస్తానని ఆ అమ్మాయి (కారుణ్య) మెసేజ్ పంపింది. గుండె వేగంగా కొట్టుకుంది. శరీరంలో జ్వరతీవ్రత లాంటిది తలను, చేతులతో అట్లాగే పట్టుకుని, అతనికి కనురెప్పలు మూతపడ్డాయి. క్షణాల్లో గాఢమైన నిద్ర అతన్ని పూర్తిగా ఆక్రమించుకుంది.

సర్వం విధ్వంసం అవుతున్న దృశ్యాలు కలలో. ప్రాఫసీ, ఎవరో అతన్ని వెంటాడుతున్నారు. పోలీసు వాడొకడు, 'చావరా లంజకొడకా,' అంటూ కసిగా బోయ్‌నెట్‌ను అతని డొక్కలో దించుతున్నాడు. వాళ్ళమ్మ, వాళ్ళ నాన్న, వాళ్ళను జనం రాళ్ళు విసురుతూ తరుము తున్నారు. పట్టణాలకు నిప్పు అంటుకుంది. మనుషులు తగలబడు తున్నట్లుగా, కమురువాసన, శరీరాలు తగలబడటం అతనికి కనిపి స్తుంది. అతను వణుకుతున్నాడు. శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరి అవు తున్నాడు. అతని చుట్టూ, సమస్తం మూసుకుపోతుంది. ఎక్కడున్నాడు అతను? మళ్ళీ వాళ్ళమ్మ గర్భంలో ఊపిరాడక ఉమ్మనీరులో తేలి యాడుతూ.

''ఒంట్లో బాగా లేదా?''

ఎవరిదో అమ్మాయి గొంతు, అతని చెవులకు దగ్గరగా గుస గుసగా వినిపించింది. తల పైకెత్తాడు. పక్క సీటులో ఆమె కారుణ్య, అతని ముఖంలోకి, ఆత్రుతగా చూస్తూ. విశాలమైన, మార్మికమైన

ఆమె కళ్ళు, అతన్నే చూస్తున్నాయి. ఆ కళ్ళలో అనంతమైన వెలుగు, రెండు స్ఫటికాల్లా మిలమిలలాడుతూ.

అతను కోపంలో ఏదో అరిచాడు. అతనికే వినబడలేదు.

''ముఖం బాగా పాలిపోయి ఉంది'' అంది, దిగులు గొంతు తో. అతను, ఆమెవైపు కోపంగా చూశాడు. చల్లటి, మృదువైన గాలి, వాళ్ళను స్పృశించింది. ఆమె ముఖం చుట్టూ, వెలుగు లాంటిది 'ఆరా' లాగా, ఆమె ఈ పరిసరాలకు సంబంధించని మనిషిలాగా.

ఆమె, అతని కళ్ళలోకి సూటిగా చూసింది. వింతగా, ప్రత్యేకం గా ఉన్నాయి ఆ కళ్ళు. ఆ కళ్ళలో మెస్మరిజంలాంటిదేదో ఉంది. ఆమె ముందుకు వంగి, అతని జుట్టు నిమురుతోంది. అచ్చం, వాళ్ళ అమ్మలాగే.

''మనం, మళ్ళీ కలుసుకోకపోవచ్చు. కానీ మానసికంగా ఎంత దగ్గరయ్యామో, కదూ'' అంది. ''ఇటు చూడు, నా వైపు...'' ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. పక్కనే ఆమె కూర్చున్న ఫీలింగ్. కారంతా ఆమె జ్ఞాపకాల వాసన.

ఎవరామె, కారుణ్యేనా? ఏమో, కానీ కారుణ్యలాగే సన్నగా, లలితలలితంగా, కానీ, క్షణంసేపు వాళ్ళమ్మలాగా కూడా ఉంది. అతని చెల్లెలి పోలికలు కూడా కనబడ్డాయి. మధురై గుడిలో ఎప్పుడో చూసిన మీనాక్షి అమ్మవారిలాగా కూడా ఉంది.

కారుణ్యా, కారుణ్యా అని రెండుసార్లు గొణుక్కున్నాడు.

''ఇదంతా ఒట్టి కల మాత్రమేనా?'' అని అనుకున్నాడతను.

కార్లు మెల్లిగా కదులుతున్నాయి. ఆ ప్రదేశమంతా ఖాళీ అవు తుంది. అతను మాత్రం, కారు స్టార్ట్ చెయ్యకుండా అలాగే నిల బడ్డాడు. కారునక్కడే వదిలేసి, వెనక్కు నడుచుకుంటూ; నడుస్తున్న అతని ముందు ఎన్నో దృశ్యాలు. గుంపులు గుంపులుగా వెళుతున్న





ఆడవాళ్ళు, ఎవరినో శపిస్తున్నట్లుగా పెద్దగా ఏడుస్తున్న ఒక ముసలమ్మ, రోడ్డుపైన అమ్మవారి విగ్రహం, నల్లగా భయం గొలిపేలా, ఆమె చేతిలో ధగధగమంటున్న రాతి ఖడ్గం, సోది చెప్పుకునే ఆడమనిషి ఖాళీబుట్టతో, జుట్టు విరబోసుకున్నట్లు ఉన్న చెట్లు, ఎవరిదో మరణం, ఎవరిదో దుఃఖం, రోడ్డుపై ఎర్రగా పారుతున్న రక్తం, గుట్టలు గుట్టలుగా తుపాకులు, కత్తులు. చంపెయ్, నరికెయ్, లంజా... పోసెయ్ నిప్పుల ఆసిడ్ను, అరుపులు, కేకలు, అతన్ని వెంటాడుతూ, అతను పరిగెత్తుతున్నట్లుగా నడుస్తున్నాడు. 'దామూ,' కారుణ్య గొంతు. ఉలిక్కిపడి వెనక్కు చూశాడు. రోడ్డు మధ్యన కారుణ్య. ఒట్టి మొండెం, తెగిన ఆమె శిరస్సు, ఆమె చేతుల్లోనే, రక్తమోడుస్తూ. అతనక్కడే కూలబడ్డాడు, ముఖాన్ని చేతుల్తో కప్పుకొని.

*నవ్య దీపావళి సంచిక, 2010*